www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 19 ఏప్రిల్ 2025

5



ఘనంగా నటుడు మహేష్ పుట్టినరోజు



మహేష్‌కు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

ప్రజాశక్తి - అమలాపురం

సినీ నటుడు మహేష్ పుట్టినరోజు వేడుకను పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్‌కు కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలి పారు. అనంతరం పూలమాలు, దుశ్శాలువాతో మహేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం మున్సిపల్ కౌన్సిలర్స్ గోపి రాజి రమేష్, వైసిపి నాయకులు దొంగ చిన్న, అమలాపురం మున్సిపల్ కౌన్సిలర్ బండారు గోవింద్, వైసిపి నాయకులు గోపి వంశీ, వీరిన చిన్న, అమలా పురం టౌన్ అల్లు అర్జున్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ పోలిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి కేంద్రం తూట్లు

- పని ప్రదేశంలో కానరాని సదుపాయాలు
- సమ్మర్ అలవెన్స్ రద్దుతో దిక్కుతోచని స్థితిలో కూలీలు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - అమలాపురం

ఉపాధి హామీ చట్టానికి కేంద్రం తూట్లు పొడుస్తోంది. వేసవి కాలం ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో బతుకు జీవుడా అంటూ ప్రతి ఒక్కరూ కూలీ పనులకు వెళుతున్నారు. మారిన జీవన విధానంలో ఎక్కువ మంది కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం ఇప్పుడు తూతూ మంత్రంగా ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు కనిపిస్తోంది. పేద కూలీలకు ఏడాదిలో వందరోజుల పనిదినాలు కల్పించే దిశగా తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టం చిన్నగా తూట్లు పొడిచేలా కనిపిస్తోంది. గతంలో ప్రతి పనిదగ్గర మెడికల్ కిట్స్ ఉండేవి. ప్రస్తుతం అవి కనిపించడం లేదు. ఉపాధి హామీ కూలీలకు ఆరోగ్యం బాగలేకపోయినా వారే మందులు తెచ్చుకోవాలి. గతంలో టెంట్లు, మజ్జిగ, మంచినీరు ఇచ్చేవారు. ప్రస్తుతం కూలీలే ఇళ్ల వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. చెట్ల నీడలోనే సేద తీరుతున్నారు. గతంలో ఉన్న సదుపాయాలు ప్రస్తుతం కనిపించడం లేదు. ఉపాధి హామీ చట్టం కూలీలకు భరోసా ఇవ్వని నేపథ్యంలో ఇతర పనులకు కూలీలు వెళుతున్నారు. వేసవి కాలం కావడంతో ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించాలని చెబుతున్నా అందుకు సంబంధించిన చర్యలు మాత్రం అధికారులు చేపట్టడం లేదు. గతంలో అయితే డ్వామా అధికారులు గ్రామాల్లోనూ ప్రత్యేకంగా ఆరోగ్య పరిరక్షణ కోసం కిట్స్ అందజేసేవారు. ప్రస్తుతం ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేక సదుపాయాలు ఏమీ కానరావడం లేదు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాల్లో అక్కడక్కడా కొన్ని గ్రామాల్లో మాత్రమే మెడికల్ కిట్స్ దర్శనమిస్తున్నాయి. సమస్యను అధికారుల దష్టికి తీసుకెళ్లినా అందుకు సంబంధించిన నిధులు అందుబాటులో లేవని అధికారులు చెబుతున్నారు. కూలీల వేతనంతోపాటు, మెటీరియల్ కూడా సకాలంలో అందడంలేదు. అధికారులు ప్రతి వారం కూలీలు చెల్లిస్తున్నామని చెబుతున్నా కింద స్థాయిలో అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. పని ప్రదేశాల్లో స్థానిక అధికారులు కూలీలకు టెంట్లు, మజ్జిగ, వాటర్ సదుపాయం కల్పించాలని అధికారులకు మొరపెట్టుకుంటున్న కేవలం కొన్ని ప్రాంతాలకు మాత్రమే ఈ సౌకర్యాలు పరిమితమయ్యాయి. అలాగే కూలీలకు గునపం, పార, గంపలు, గొడ్డలి, తట్టలు వంటి పనిముట్లు అందజేసే రుసుము కూడా ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. వేసవి సమయంలో రెండు పూటలా పని వల్ల చాలా ఇబ్బంది పడుతున్నారని ఎండ దెబ్బకు కూలీలు సొమ్మ సిల్లి పడిపోయే ప్రమాదం కూడా ఉందని కూలీలు ఆపోతున్నారు.

జిల్లాలో 1.51 లక్షల జాబ్ కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2.23 లక్షల జాబ్ కార్డులు మంజూరు చేయగా 1.51 లక్షల జాబ్ కార్డులు మాత్రమే యాక్టివ్ లో ఉన్నాయని జిల్లా డ్వామా పీడీ మధుసూదన్‌రావు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 92వేల700 మంది ఉపాధి హామీ కూలీలు ఉపాధి పొందుతున్నారన్నారు. వీరిలో అత్యధికంగా 65 శాతం అంటే దాదాపు 60 వేల మంది మహిళా ఉపాధి కార్మికులు ఉండగా మిగిలిన 35 శాతం అనగా 32 వేల మంది పురుషులు ఉపాధి హామీ కూలీలు ఉన్నారన్నారు. ఉపాధి హామీ కూలీకు రోజువారి పనికి గాను రూ.291.54 వేతనంగా అందిస్తున్నారన్నారు. జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు వేతనాల కింద రూ.11,967.54 లక్షల ఖర్చు చేస్తున్నారని 2025 మార్చ్ 31 వరకు ఉపాధి హామీ 69.21 కోట్లు బకాయి వేతనాలను చెల్లించాలన్నారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేసే ప్రయత్నం



కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నం చేస్తోంది. ఉపాధి హామీ పనులు 200 రోజులు పని కల్పించాలి. ఉపాధి హామీ చట్టంలో రూ. 600కనీస వేతనం కూలీలకు చెల్లించాలి. పని ప్రదేశాలలో కనీస అవ సరాలు కల్పించాలి. ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ ఎలవెన్సులు సకాలంలో చెల్లించాలి. వేతన బకాయిలు చెల్లించాలి.

- కారెం వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కన్వీనర్, అమలాపురం

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి



ఉపాధి హామీ కూలీలకు సుమారు ఆరు వారాలు పైబడి బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఒక వైపు వ్యవసాయం పనులకు రైతులు ఉపాధి హామీ కూలీలకు పనులు చెప్పడం లేదు. మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు వేతనాలు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తిచేస్తున్నా.

-బీర వెంకట్రావు, ఉపాధి హామీ కూలి, అమలాపురం

గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం



తాగునీటి పథకాన్ని ప్రారంభించిన ఎంపీ హరీష్, ఎంఎల్ఎ సత్యానందరావు

ప్రజాశక్తి - కొత్తపేట

గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, ఎంపీ హరీష్ మాదుర్ అన్నారు. కొత్తపేట మండలం వాడపాలెం గ్రామంలో పలు అభివృద్ధి పనులను స్థానిక ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, ఎంపీ గంటి హరీష్ మాధూర్‌లు ప్రారంభించారు. గ్రామ ప్రజలకు తాగు నీటి సరఫరా కోసం ఇంటింటికీ తాగునీటి పథకం ద్వారా రూ.89.80లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకును ప్రారంభించారు. అలాగే రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ఘన ద్రవ్య వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సత్యానందరావు మాట్లాడుతూ గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. కొన్ని అభివృద్ధి పనులు నిర్మాణం పూర్తి కానున్నాయని త్వరలోనే వాటిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అభివృద్ధి కోసం అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన ఎంపీ హరీష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఎంపీ హరీష్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఎంఎల్ఎ సత్యానందరావు కోరిక మేరకే నిధులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. అభివృద్ధి కోసం కృషి చేయడంలో ఎంఎల్ఎకు తోడుగా ఉంటా నని చెప్పారు. అనంతరం ఎంఎల్ఎ సత్యానందరావు, ఎంపీ హరీష్‌లను గ్రామస్తులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అలాగే ఉత్తమ సర్పంచ్‌గా ఎన్నికై ఢిల్లీలో అవార్డు అందుకున్న గ్రామ సర్పంచ్ త్సామా ఆదినారాయణ మూర్తిని ఎంఎల్ఎ, ఎంపీ చేతుల మీదుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందపల్లిలో రోడ్డు పనులకు శంకుస్థాపన

కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో ఎంపీ లాడ్స్ రూ.30 లక్షల నిధులతో ఏటు గట్టుపై నూతన రోడ్డు నిర్మాణానికి కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, ఎంపీ గంటి హరీష్ మాదుర్, ఆకుల రామకృష్ణ శంకుస్థాపన చేశారు. మందపల్లి మందేశ్వర(శనీశ్వర) స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు ఈ రోడ్డు ఉపయోగకరంగా ఉంటుందని, గ్రామస్తులకు కూడా ఈ రోడ్డు నిర్మిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్‌కు సత్కారం



డాక్టర్ శ్రీకాంత్ ను సత్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్‌గా నియమితులైన డాక్టర్ పినిపే శ్రీకాంత్ శుక్రవారం వానపల్లిపాలెంలోని వైసిపి కార్యకర్తలను కలిశారు. కోఆర్డినేటర్‌గా నియమితులైన డాక్టర్ శ్రీకాంత్ తొలిసారి గ్రామానికి రావడంతో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు నల్లా నాయుడు ఆధ్వర్యంలో టిడిపికి చెందిన దోనిపాటి మీరా సాహెబ్‌తో పాటు పలువురు కార్యకర్తలు శ్రీకాంత్ సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చీకట్ల కిషోర్, వైసిపి నాయకులు మోటూరి సత్యం కాపు, నల్లా సూర్యప్రకాష్, నల్లా ఆదినారాయణ, శ్రీను, రమేష్, వీరభద్రం, మెట్ల శ్రీను, పెయ్యల శ్రీనివాస్, పల్లి చంద్ర రావు, వల్లూరి ఏడుకొండలు, మోకా దుర్గారావు, పినిపే ప్రదీప్, పెట్టా సిద్దు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయి ఉద్యోగులుగా గుర్తించాలి

ఫీల్ అసిస్టెంట్ల వినతి



ఎంపిడిఒ రాజుకు వినతి పత్రం అందజేస్తున్న ఫీల్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి - ఆలమూరు

ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను గ్రామస్థాయి ఉద్యోగులుగా గుర్తించాలంటూ ఎంపిడిఒ ఎ.రాజుకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన 19 ఏళ్లుగా గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తమను గ్రామ పంచాయతీ సిబ్బందిగా క్రమబద్ధీకరించాలన్నారు. మండలం యూనిట్ గా తీసుకుని అంతర్గత బదిలీలు చేపట్టడం ద్వారా స్థానిక ఒత్తిడిలను అధిగమించి మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు వీలు కల్పించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎఫ్‌టిఇ ఇచ్చి పూర్తిస్థాయి హెచ్‌ఆర్ పాలసీ, హెల్త్‌కార్డు, ప్రమాద బీమా, గ్రాడ్యుటి వంటి సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్ ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వడంతో పాటు, రూ.10 లక్షల నష్టపరిహారం అందించాలన్నారు. 2016-19 సంవత్సరాల మధ్య కాలంలో ఎన్‌ఆర్ఇజిఎస్ లో పనిచేస్తున్న అన్ని కేటగిరీల ఉద్యోగులకు జీతాలు పెరిగాయని, ఫీల్ అసిస్టెంట్లకు మాత్రం పెరగలేదన్నారు. మాకు కూడా అదే స్థాయిలో జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యాఅర్హతల ఆధారంగా కంప్యూటర్ ఆపరేటర్లుగా, టెక్నికల్ అసిస్టెంట్గా పదోన్నతి కల్పించాలని వారు కోరారు. పై డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపిడిఒకు అందజేశామని ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిధి ఫీల్ అసిస్టెంట్లు పెద్దిరాజు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి



వీరేశలింగం జయంతి వేడుకలో మాట్లాడుతున్న వక్తలు



పాల్గొన్న కవులు, రచయితలు తదితరులు

ప్రజాశక్తి - రావులపాలెం

సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు అని అరసం జాతీయ అధ్యక్షుడు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ అధ్యక్షతన అభ్యుదయ రచయితల సంఘం, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కందుకూరి వీరేశలింగం 177 జయంతి కార్యక్రమానికి పెనుగొండ లక్ష్మీనారాయణ, జెవివి రాష్ట్ర ప్యాట్రన్ డాక్టర్ చల్లా రవికుమార్, కవి సాహిత్య విశ్లేషకులు డాక్టర్ శ్రీపాద సీతామహలక్ష్మి, అద్దేపల్లి ప్రభు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16న జన్మించారని అన్నారు సాహితీ వ్యాసా రంగంలోకృషి చేశారన్నారు. తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు స్త్రీ విద్యకై ఉద్యమించి ప్రచారం ఉధృతం చేసి బాలికలకు పాఠశాలలు ప్రారంభించారన్నారు. మగ పిల్లలతో ఆడపిల్లలు కలిసి చదువుకొనే సహ విద్యా విధానం ప్రవేశపెట్టారన్నారు. అలాగే పలువురు మాట్లాడుతూ వితంతు పునర్వివాహాలు జరిపించాలని ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఆచరణ కు నాంది పలికాలన్నారు. అలాగే యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఆయన రావుబహు దూర్ బిరుదాంకితులన్నారు. ఈ సందర్భంగా కవులు, రచయితలు కందుకూరి గురించి ఇచ్చిన సందేశాలు, గేయాలు పలువురి ఆకర్షితులను చేశాయన్నారు. అనంతరం కవులకు, రచయితలకు సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఆర్‌ఎస్.సుబ్రహ్మణ్యం, కెఎమ్ఎమ్ఆర్.ప్రసాద్, ఖాజామొహిద్దీన్, పి.లింగేశ్వర రెడ్డి, జిల్లా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి, ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలనుండి అధిక సంఖ్యలో రచయితలు, కవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాల భవనానికి నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రం శివారు కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి ఒఎన్‌జిసి అధికారులు నిధులు కేటాయించాలని జూనియర్ కళాశాల విద్యార్థులు, ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఎఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఒఎన్‌జిసి కార్యకలాపాల వల్ల ఇక్కడి నేల స్వరూపంలో మార్పులు ఏర్పడి కళాశాల భవనాలు దెబ్బతిన్నాయని వారు అభిప్రాయపడ్డారు. జిల్లాలో పలుచోట్ల ఈ కళాశాలతో పాటు నిర్మించిన భవనాలు దఢంగానే ఉన్నాయని, అయితే ఇక్కడి భవనాల గోడలు మాత్రం పగుళ్లు ఏర్పడి పూర్తిగా శిథిలావస్థకు చేరాయని అన్నారు. ఇందుకు ఒఎన్‌జిసి కార్యకలాపాలు సైతం ఒక కారణం అని వారు గళమెత్తారు. చుట్టుపక్కల గ్రామాల నిరుపేద విద్యార్థులకు విద్యను అందిస్తున్న ఈ కళాశాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇక్కడి వనరులను తీసుకుని వెళ్లడంతో పాటు ఈ ప్రాంతంలో విద్య వైద్యం మౌలిక సదుపాయాల కల్పన చేయాల్సిన బాధ్యత ఒఎన్‌జిసికి ఉందని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని జెసి నిషాంతికి, రెవెన్యూ, ఒఎన్‌జిసి అధికారులకు అందజేసినట్లు ఎఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ విద్యార్థి విభాగంతో పాటుగా కళాశాలలో విద్యనభ్యసిస్తున్న పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పేరూరులో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



పేరూరులో మజ్జిగ చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్‌లు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్


అమలాపురం మండలం పేరూరు వై.జంక్షన్‌లో సరస్వతి ముత్యాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టిఎస్ఎన్.మూర్తి మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారంపేరూరు సర్పంచ్ దాసరి అరుణ, డేవిడ్, బోడసకుర్రు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, నాగేశ్వరరావులు సంయుక్తం గా ఈ మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో పేరూరు ఉప సర్పంచ్ కుడుపూడి సత్య నారాయణ, పులుసు జగదీశ్, మానసిక వైద్యులు డా. గంగరాజు, పండు అశోక్ కుమార్, దొంగ కుమార్, అడపా శ్రీను, నాతి శ్రీనివాసరావు, జల్లి శ్రీనివాసరావు, నెల్లి ప్రసాద్, దేవరపల్లి వీరేష్ కుమార్, యెలమిల్లి కొండ, ట్రస్ట్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి శుక్రవారం పలువురు దాతలు విరాళాలు సమర్పించారు. కృష్ణా జిల్లా పటమట చెందిన పాలడుగు రామనాథబాబు, వారి కుటుంబ సభ్యులు రూ.50, 116, వాడపల్లి గ్రామానికి చెందిన సరిదే యరకయ్య, సూర్యకాంతం దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ.30, 116 ఆలయ డిసి నల్లం సూర్య చక్రధర రావుకు అందజేశారు. వీరికి స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్నందుకు కృతజ్ఞతల తెలిపారు.

కార్టూ'నిజం'



ఒఎన్‌జిసి డ్రిల్లింగ్‌తో చౌడుబారుతున్న భూములు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలో పలు గ్రామాల్లో ఒఎన్‌జిసి ప్రాజెక్టుల నేపథ్యంలో డ్రిల్లింగ్ కార్యకలాపాల వల్ల భూములు చౌడుబారి రైతులు నష్టపోతున్నారని ఉమ్మడి జిల్లా జనసేన కార్యదర్శి, పినపళ్ల సర్పంచ్ సంగిత సుభాష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 17న కొత్తూరులోని ఎస్‌జెఆర్ కళ్యాణ మంటపంలో ఒఎన్‌జిసి జరిపిన కాలుష్య నియంత్రణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. దీనిలో భాగంగా డ్రిల్లింగ్ కారణంగా తలెత్తుతున్న సమస్యలను ఒఎన్‌జిసి రాజమహేంద్రవరం చీఫ్ జనరల్ మేనేజర్ కెవికె.రాజు, జెసి నిషాంతి, రామచంద్రపురం ఆర్‌డిఒ అఖిల దృష్టికి తీసుకొని వెళ్లి వినతి అందజేసినట్లు శుక్రవారం స్థానిక విలేకరులకు సర్పంచ్ తెలిపారు. అలాగే పినపళ్ల, పెదపళ్ల, సంధిపూడి, కలవచర్ల, పెనికేరు, చింతలూరు తదితర గ్రామాల్లో చమురు, సహజ వాయువుల వెలికితీతకు తరచూ ఒఎన్‌జిసి డ్రిల్లింగ్ చేపట్టడం వల్ల సమీపంలోని భవనాలు బీటలు వారుతున్నాయని ఆరోపించారు. మండపేట జిసిఎస్ పరిధిలో ఉన్న 51 బావుల ద్వారా రూ. వందల కోట్ల విలువైన చమురు నిక్షేపా లు వెలికి తీసి ఆదాయం పొందుతున్న ఒఎన్‌జిసి, ఆమేరకు గ్రామాల అభివృద్ధి చేయలేదన్నారు. రైతులు ఇచ్చిన భూమికి పదేళ్ల క్రితం చెల్లించిన శిస్తునే ఇవ్వడం వల్ల రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒఎన్‌జిసికి లీజుకు ఇచ్చిన రైతుల భూమి ఏవిధమైన క్రయ విక్రయాలు జరగకపోవడంతో వారు ఆర్థికంగా కుదేలవుతున్నాయన్నారు. ఇకనైనా రైతులు ఇచ్చిన భూమికి ప్రభుత్వ ధరకు రెండున్నర రెట్లు అధికంగా చెల్లించి భూమిని స్వాధీనం చేసుకునే విధంగా జెసి చొరవ చూపాలని కోరినట్లు సర్పంచ్ తెలిపారు. ఒఎన్‌జిసి డ్రిల్లింగ్ వలన రైతులకు, గ్రామస్తులకు ఇబ్బంది లు తలెత్తితే వారిని పట్టించుకునే వారుండరన్నారు. ఇటీవల పినపళ్లలో ఒఎన్‌జిసి నిర్మించిన తారు రోడ్డు తూతూమంత్రంగా ఉండడంతో రోజుల వ్యవధిలోనే పూర్తిగా ధ్వంసం కాగా పలుమార్లు ఫిర్యాదు చేసిన సంస్థ పట్టించుకోలేదన్నారు. సంస్థకు అవసరార్థం ప్రజలు గుర్తుకు వస్తారని, తీరగానే పట్టించుకోలేదని విమర్శించారు. కొత్తూరు, వెదురుమూడి రోడ్డు ఒఎన్‌జిసి వాహనాల రాకపోకలతో ఛిద్రం కాగా నిరసనలు వ్యక్తమవుతున్నా ఒఎన్‌జిసి అధికారులు స్పందించలేదన్నారు. ఇకనైనా స్పందించి ఒఎన్‌జిసి ఏర్పాటు చేసుకునే రిగ్గులు, డ్రిల్లింగ్ ల సమీప గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించానన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



ద్రాక్షారామంలో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

గుడ్‌ఫ్రైడే సందర్భంగా జిల్లాలోని చర్చిల వద్ద క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు త్యాగాన్ని గుర్తుచేసుకున్నారు. **రామచంద్రపురం:** క్రైస్తవులు అందరూ భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. విశ్వశాంతి కోసం ఏసుక్రీస్తు చేసిన త్యాగాలకు ప్రతీక గుడ్ ఫ్రైడే సిలువ ధ్యాన ప్రార్థనలు అని రెవరెండ్ ఫాదర్ ప్రేమ్ కుమార్ అన్నారు. రామచంద్రపురంలో రెవరెండ్ ఫాదర్ అంతయ్య ఆధ్వర్యంలో లారీ యూనియన్ ఆఫీసు నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న దివ్య కారుణ్య దేవాలయం వరకు సిలువ ర్యాలీ నిర్వహించారు. ద్రాక్షారామంలో రోమన్ కాథలిక్ ఆలయం లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు ఫాదర్ జోసెఫ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డాక్టర్ పివి.సత్యనారాయణ ఆధ్వర్యంలో రాలి నిర్వహించారు. **కపిలేశ్వరపురం:** మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే భక్తిశ్రద్ధలతో క్రైస్తవులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కపిలేశ్వరపురం, మాచర, టేకి, వెదురుమూడి, కోరుమిల్లి, అంగర, తాతపూడి, తదితర గ్రామాల్లో క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** మండలంలోని ఆయా గ్రామాలలో గల క్రైస్తవ ప్రార్థనా మందిరాలలో శుక్రవారం గుడ్ ఫ్రైడే నిర్వహించారు. క్రీస్తు మరణ పునరుద్ధానం విశిష్టతను బోధించారు. ఉప్పలగుప్తం పెద్దూరు ఆర్‌సిఎం చర్చిలో పాస్టర్ పినిపే జయరాజ్ క్రీస్తు సిలువ మరణం పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా ఆయా ప్రార్థన మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తుతెలిని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురు 216వ జాతీయ రహదారిలో గ్రోవెన్ ఎదురుగా శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీ కొని పెదపట్నం లంక గెద్దం వారి పేటకు చెందిన బూల వెంకటరత్నం(34) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇవి.. మోటార్ సైకిల్‌పై కరెంటు సామాన్లు కోసం వెంకటరత్నం మామిడి కుదురు వస్తున్నాడు. ఈ సమయంలో ప్రమాదానికి గురయ్యాడని కుటుంబ సభ్యులు తెలిపారు మృతునికి ఏడేళ్ల క్రితం లక్ష్మీ దుర్గ తో వివాహమైంది. అతనికి ఆరేళ్ల భరత్ సాయి, రెండేళ్ల మారుతి లక్ష్మి సంతానం. హైదరాబాద్లో సిఎంఆర్ లో పనిచేస్తున్న వెంకటరత్నం మూడు రోజుల సెలవులు రావడంతో స్వగ్రామము వచ్చి రోడ్డు ప్రమాదంలో మతి చెందడం కుటుంబ సభ్యులను కలచివేసింది. కుటుంబ యజమాని మృతితో తమ జీవనోపాధి కోల్పోయామని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. ఈ ఘటనపై నగరం ఎస్ఐ చైతన్య కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గళ్లలో చోరీ

ప్రజాశక్తి - సీతానగరం

ముగ్గళ్ల గ్రామంలో శుక్రవారం చోరీ జరిగింది. బాధితులు కూచిపూడి సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ చోరీ జరిగిందన్నారు. బీరువాలో ఉన్న రూ.20 వేల నగదు, కాసు బంగారు సూత్రం, ఉంగరం గొలుసు, వెండి సామగ్రి, గ్యాస్ బండ చోరీకి గురయ్యాయన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గుర్తుతెలిని మహిళ మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని ఎర్రవరం ఏలేరు కాలువలో గుర్తు తెలిని 50 ఏళ్ల పైబడిన మహిళ మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. ఎస్ఐ ఎస్.రామలింగేశ్వరావు తెలిపిన వివరాలివి. ఎర్రవరం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఏలేరు కాలువలో 50 ఏళ్ల పైబడిన మహిళ మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో లభించిందన్నారు. మృతురాలు లేత ఆకుపచ్చ రంగు జాకెట్టు, ముదురు ఆకుపచ్చ రంగు చీర ధరించి ఉందన్నారు. ఎర్రవరం వీఆర్ఒ ఎం.అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బంధువుల గుర్తింపు నిమిత్తం ప్రతిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు ఏలేశ్వరం పోలీస్ స్టేషన్ నెంబర్ 08868 224033, లేదా 9440904835 నంబర్లకు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

ఆక్రమణల చెరలో శివకోడు జాతీయ రహదారి

ప్రజాశక్తి - రాజోలు

మండలంలోని శివకోడు పంచాయతీ పరిధిలో శివకోడు జాతీయ రహదారి 216 పై మూలమామిడి సెంటర్‌లో జాతీయ రహదారి216 ని ఆక్రమణలు గురైంది. ఆక్రమణలతో పాటు రహదారి మలుపులో వ్యాపారం చేసుకునేలా వ్యాపార దుకాణాలు, రహదారికి అడ్డంగా అక్రమ నిర్మాణాలను నిర్మించారు. అయినప్పటికీ నేషనల్ హైవే అథారిటీ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఆక్రమణల విషయమై స్థానిక రెవెన్యూ అధికారులను సంప్రదించగా రెవెన్యూ వారికి ఏమీ సంబంధమని రాజోలు తహశీల్దార్ అన్నారు. హైవే ఆక్రమణలపై స్థానిక ప్రజలు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజోలు మండలంలో జాతీయ రహదారి 216 పై పలుచోట్ల ఆక్రమణలు జరిగి అక్రమ నిర్మాణాలు చేపట్టినప్పటికీ నేషనల్ హైవే అథారిటీ, రెవెన్యూ అధికారులు మౌనం వహించడం పట్ల స్థానిక ప్రజలలో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.



జాతీయ రహదారి 216పై మూలమామిడి సెంటర్‌లో ఏర్పాటైన వ్యాపార దుకాణాలు, అక్రమ నిర్మాణాలు

సేవా కార్యక్రమాలకు ఓఎన్‌జిసి చేయూత

ప్రజాశక్తి - మామిడికుదురు

సామాజిక సేవా కార్యక్రమాలకు ఓఎన్‌జిసి చేయూతనిస్తుందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతన్ దాస్ అన్నారు అప్పనపల్లి బాల బాలాజీ స్వామిని శుక్రవారం ఆయన చీఫ్ జనరల్ మేనేజర్ హెచ్ఆర్.రామారావు తో కలిసి, కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్నారు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేద ఆశీర్వాదం అందజేశారు ఆలయ సహాయ కమిషనర్ ఎం. సత్యనారాయణ రాజు ఇడికి నూతన వస్త్రాలు బహూకరించి స్వామివారి ప్రసాదం అందజేశారు అనంతరం ఆలయ ఆవరణలో ఓఎన్‌జిసి నిధులు రూ.ఐదు లక్షలతో నిర్మిస్తున్న వాటర్ ప్లాంట్ ను పరిశీలించి, నిర్మాణ పనుల తీరు అడిగి తెలుసుకున్నారు దీనిని త్వరలో ప్రారంభించి వినియోగంలోకి తీసుకు వస్తామన్నారు. ఆయన వెంట స్థానిక ఓఎన్‌జిసి అధికారులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్ ను పరిశీలిస్తున్న ఓఎన్‌జిసి ఇడి శాంతన్ దాస్

కుట్టు శిక్షణ ద్వారా మహిళలకు చేయూత

ప్రజాశక్తి - ఆలమూరు

ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణతో మహిళలకు చేయూతనందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని చొప్పెల్ల, ఆలమూరులలో కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఎంపిడిఒ, ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ ఎ.రాజులతో కలిసి కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో కటింగ్, స్టిచ్చింగ్ లబ్ధిదారులకు నేర్పిస్తారని అన్నారు. ఎ. అలాగే 75 శాతం హాజరు తప్పక ఉండాలని వారికి ఉచితంగా మిషన్లు అందజేయడం జరుగుతుందన్నారు. ఇదంతా మీ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఈ రెండు కేంద్రాల ద్వారా సుమారు 300 మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఆలమూరు డిసి అధ్యక్షులు మెర్ల గోపాలస్వామి, జనసేన మండల అధ్యక్షుడు సూరప్రెడ్డి సత్య, సర్పంచులు దంగేటి చంద్రశేఖర బాపనయ్య, నాతి లావణ్య కుమార్ రాజా, కార్యదర్శులు ఎం.వెంకటరెడ్డి, కె.మోక్షంజలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చొప్పెల్లలోని కుట్టు శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్యానందరావు

ఇసుకను అందుబాటులో ఉంచాలి

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రానున్న వర్షాకాలం దృష్ట్యా జిల్లాలో డీసిల్టేషన్, ఓపెన్ రీచ్‌లు, సెమీ మెకానైజ్డ్ పాయింట్ల ద్వారా తవ్వకాలు చేపట్టి 12 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను 45 రోజుల్లోగా గుర్తించిన స్టాక్ యార్డుల్లో అందుబాటులో ఉంచేలా చూసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇసుక సరఫరా విధానంపై ఏజెన్సీల ప్రతినిధులతో జెసి ఎస్.చిన్నరాముడు, ఆర్‌డిఒలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బివి.గిరితో కలిసి కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తు నిర్మాణాలకు ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో స్టాక్ యార్డులను గుర్తించి అక్కడ ఇసుక నిల్వలను ఏర్పాటు చేయాలన్నారు. ఇందు కోసం ప్రభుత్వం గుర్తించిన లేదా ఏజెన్సీస్ గుర్తించిన స్థలంలో ఇసుక స్టాక్ యార్డులకు అనుమతి ఇస్తామన్నారు. ఏజెన్సీలు స్వయంగా స్టాక్ యార్డులను నిర్వహించేందుకు ముందుకొస్తే ఆ మేరకు అనుమతి ఇస్తామన్నారు. రానున్న రెండు రోజుల్లో అంగీకారం, స్థలం వివరాలను రాత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ఆయా భూములకు మార్గదర్శకాలు అనుసరించి అద్దె చెల్లిస్తామన్నారు. రిజర్వు చేసిన ఇసుక నిర్దిష్ట సోర్స్ పాయింట్ వద్ద కార్యకలాపాల ఖర్చు ఆధారంగా జిల్లా స్థాయి ఇసుక కమిటీ ద్వారా రీచ్ రేటును నిర్ణయిస్తుందన్నారు. అంతకంటే ఎక్కువ ధరకు వినియోగదారునికి ఇసుక సరఫరా చేయడం ఉల్లంఘనగా పరిగణనలోకి వస్తుందన్నారు. ధర నిర్ణయించే క్రమంలో మాన్యువల్ రీచ్/సెమీ-మెకనైజ్డ్ రీచ్, డీ సిల్టేషన్ పాయింట్ ఆధారంగా ఏజెన్సీస్ గతంలో కోట్ చేసిన ధర ఆధారంగా ఉంటుందన్నారు. ఆయా రీచ్ పాయింట్స్ ఆధారంగా ధర భిన్నంగా ఉంటుందన్నారు. వినియోగదారులకు ఇసుకను సరఫరా చేసే తుది ధర బేస్ రేటును అనుసరించి నిర్ణయిస్తామని తెలిపారు. జియో మ్యాపింగ్ ఆధారంగా కాకుండా రీచ్ పాయింట్ నుంచి స్టాక్ యార్డ్ వరకు ఉన్న దూరాన్ని వాస్తవంగా నిర్ధారణ చేస్తామన్నారు. ఇసుక సరఫరా విధానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వివిధ మార్గాల్లో ఏజెన్సీల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ ఐవిఆర్ఎస్ ద్వారా చేపడతామన్నారు. స్టాక్ పాయింట్ నిర్వహణ, అమ్మకాల విషయంలో నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

నగరం కళాకారునికి డాక్టరేట్

ప్రజాశక్తి - మామిడికుదురు

'నగరం' గ్రామానికి చెందిన బుర్ర కథ కళాకారుడు మంగం సత్యనారాయణ గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లో డాక్టర్ ఎన్‌టిఆర్ కళామందిర్‌లో గురువారం జరిగిన సమావేశంలో పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ ప్రతిష్టాత్మకమైన డాక్టరేట్ అవార్డుతో మంగం సత్యనారాయణను సత్కరించింది. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ అకాడమీ ఆధ్వర్యంలో అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. డాక్టరేట్ అందుకున్న సత్యనారాయణను శుక్రవారం గ్రామం లో పలువురు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

కూటమి హయాంలో ప్రభుత్వాసుపత్రి ప్రక్షాళన

ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

గత ఐదేళ్ల వైసిపి పాలనలో వెంటిలేటర్‌పై ఉన్న రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లో ప్రక్షాళన చేసి ఒక దారికి తెచ్చామని సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కూటమి నాయకులతో కలిసి ఆయన ఆసుపత్రిని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తమకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే అసెంబ్లీ సాక్షిగా మాట్లాడి ఒక నోడల్ అధికారిని నియమించేలా చేశామని చెప్పారు. ఆ అధికారి ఎప్పటికప్పుడు రోగులు, వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవల కోసం చర్యలు చేపడుతున్నారన్నారు. తాను 15 రోజులకు ఒకసారి ఆసుపత్రిని సందర్శిస్తున్నానని తెలిపారు. మార్చురీ వద్ద మృతుల బంధువుల నుంచి డబ్బులు వసూలు చేయడాన్ని పూర్తిగా అరికట్టామన్నారు. రీల్స్ స్టార్ భరత్ మార్చురీ వద్ద జరుగుతున్న అవినీతి గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ప్రెస్ మీట్ పెట్టి తనను తిట్టడం తప్ప ఆయనకు వేరే పని లేదన్నారు. సమస్యలుంటే నిర్మాణాత్మకంగా ఎత్తి చూపాలని కాని ప్రచారం పిచ్చితో నోటికొచ్చినట్టు అవాస్తవాలు మాట్లాడడం తగదని హితవు పలికారు. గత వైసిపి సర్కారు రూ.2వేల కోట్ల మేర ఆరోగ్యశ్రీ బకాయిలు పెట్టిందన్నారు. వాటిని తమ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. సిఎస్ఆర్ నిధులు పేపరు మిల్లు నుంచి రూ.1.20 కోట్లు వచ్చాయని, మరో రూ.40 లక్షలు రానున్నాయని తెలిపారు. నగరంలో బ్లేడ్ బ్యాచ్ గంజాయి బ్యాచ్ లను అణచివేశామని, మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. నాగాంజలి ఆసుపత్రిలో ఉన్నప్పుడు దారిన వెళ్తున్న విద్యార్థులను ఆప మాజీ ఎంపీ భరత్ వారితో ఆందోళన చేయించాడని, తామిమాత్రం ఆ కుటుంబానికి న్యాయం జరిగేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆయన వెంట అత్తి సత్యనారాయణ తదితరులున్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు, బెంచీలు బహూకరణ

ప్రజాశక్తి - కె.గంగవరం

కోత్తకోట గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలకు గ్రామస్తుడు నామాన్ని సత్తిబాబు బెంచీలు, ఫ్యాన్లు, బీరువాలు, ప్రింటర్, గ్రీన్ బోర్డు తదితర ఫర్నీచర్ శుక్రవారం బహూకరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆయన ఏర్పాటు చేసిన బెంచీలు, ఫ్యాన్లు తదితర వస్తువులు ఉపయోగపడతాయని విద్యార్థులు తల్లిదండ్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొత్తకోటలో గల ప్రభుత్వ పాఠశాలకు అందజేసిన ఫర్నిచర్

ఉపాధి పనులు పూర్తి స్థాయిలో కల్పించాలి

ప్రజాశక్తి - రాజులూరు

ఉపాధి కూలీలకు పనులు పూర్తిస్థాయిలో కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని శీలంలంక, ఒంటిమిడి గ్రామాల్లో ఉపాధి కూలీల సమస్యలపై ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఈశ్వరావు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో ఉపాధి కూలీలకు విరివిగా పనులు కల్పించేందుకు మండల స్థాయి అధికారులు చేస్తున్న కృషికి స్థానిక పంచాయతీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీలకు ఏప్రిల్ ఒకటి నుండి పనులు కల్పించవలసిన అవసరం ఉందని కొన్ని అనివార్య కారణాల వల్ల పనులు కల్పించడంలో కొంత జాప్యం జరిగిందన్నారు. మండలంలో కొన్ని గ్రామాలలో పనులు ప్రారంభించారని, కానీ కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయి వేతనాలు రాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం, పిఠాపురం

అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పెద్దాపురం అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో పలు పరిశ్రమలలో పని చేస్తున్న కార్మికులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఎడిఎఫ్ఒ ఎం.శ్రీహరి జగన్నాథ్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది పరిశ్రమలలో పని చేసే కార్మికులకు అగ్ని ప్రమాదాలు జరుగకుండా పని చేసే ప్రదేశాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను ఆర్పే విధానాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్మికులతో మంటలను ఆర్పే విధానాలపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం ఎల్ఎఫ్‌ఒ ఎన్.గీతాప్రసాద్, జి.దుర్గాప్రసాద్, డి.ఒపిహెచ్.నాగేశ్వర్, ఎఫ్ఎంలు డి.నానాజీ, ఎం.డి.యూసుఫ్, ఎం.రాజు పాల్గొన్నారు.

పిఠాపురం అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా స్థానిక బైపాస్‌లో ఉన్న జెజిఆర్ ఫ్యూయల్ పెట్రోల్ బంక్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి డి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖల ఆధ్వర్యంలో ఏప్రిల్ 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పెట్రోల్ లేదా డీజిల్ ఫిల్లింగ్ చేస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

శారీరక వ్యాయామంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ప్రతిరోజు శారీరక వ్యాయామం చేయడం వల్ల మనిషి మరింత శక్తితో పాటు సాధారణ ఆరోగ్యం మెరుగు పడుతుందని పోషకాహార నిపుణులు మల్లీశ్వరి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ వ్యాయామ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 18న జాతీయ వ్యాయామ దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ప్రజలందరిలో వ్యాయామం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించడం ఈ దినోత్సవ లక్ష్యమన్నారు. క్రమం తప్పకుండా శారీర వ్యాయామం చేయడాన్ని దినచర్యలో ఒక భాగంగా చేసుకోవాలన్నారు. వ్యాయామాలలో సులభమైంది వాకింగ్ అన్నారు. ప్రతిరోజు 30 నిమిషాల పాటు వాకింగ్ చేయడం వల్ల శరీరకంగా, మానసికంగా అధిక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని మల్లీశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య చికిత్సలో ఫిజియోథెరపీ కీలక పాత్ర

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఆరోగ్య జీవనాన్ని కొనసాగించేందుకు నిర్దేశించిన ఒక ప్రముఖ వైద్య ప్రక్రియ ఫిజియోథెరపీ అని వైద్య చికిత్సలో ఈ వైద్య విధానం కీలక పాత్ర పోషిస్తుందని ఆ వైద్య నిపుణులు సత్యవాణి పేర్కొన్నారు. బోట్ క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. చాతి, గుండె, కండరాల నొప్పులు, పక్షవాతం, అంగవైకల్యంతో పాటు క్యాన్సర్ వల్ల వచ్చే నొప్పులకు ఫిజియోథెరపీ ఉపశమనం ఫిజియోథెరపీ ద్వారా లభిస్తుందన్నారు. పెద్ద ఖర్చు లేకుండా, శరీరాన్ని పాడు చేయకుండా చేసే వైద్యమే ఫిజియోథెరపీ అని సత్యవాణి తెలిపారు. వాకర్స్ సంఘం అధ్యక్షుడు అడబాల రత్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, యనమల రామం, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, ఎం.సుబ్బారావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అసమానతల తొలగింపునకే రుణాలు

ప్రజాశక్తి-తుని

ఆర్థిక అసమానతలు తొలగించాలనే ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలను మంజూరు చేస్తున్నట్లు మాజీ ఆర్థిక మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. శుక్రవారం తేటగుంట పార్టీ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి తోపాటు, తుని నియోజకవర్గ పరిధిలోని తుని, కోటనందూరు, తొండంగి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మంజూరు చేస్తున్న కార్పొరేషన్ రుణాలను పారదర్శకంగా అందించాలని అధికారులకు సూచించారు. సచివాలయాల సిబ్బంది ఖాళీలను బట్టి సర్దుబాటు చేయాలని యనమల సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు చింతమనేడి అయ్యప్ప, మోతుకూరు వెంకటేష్, తుని ఎంపిడిఒ కె.సాయి నవీన్, ఇఒపిఆర్‌డి జయరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి పనిచేయాలి

ప్రజాశక్తి-కిర్లంపూడి

వైసిపి బలోపేతానికి ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కోరారు. పార్టీ ప్రత్తిపాడు మండల నూతన కమిటీ ఉపాధ్యక్షుడిగా బాబ్జి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సానా పోలరాజు శుక్రవారం గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జువ్వల చినబాబు, రాపా గుర్రాజు తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయంలో 'కుడా' చైర్మన్ పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

కుడా చైర్మన్ తుమ్మల బాబు కుటుంబ సమేతంగా శుక్రవారం పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలోని నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సౌజన్య ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

గుంతల రోడ్డుకు ట్రాఫిక్ పోలీసుల మోక్షం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో గుంతల మయంగా ఉన్న రోడ్డుకు రిపేర్లు చేపట్టడంలో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు చొరవ చూపారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లోని యతి హోటల్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారికి పడిన గుంతల కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్న కారణంగా ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు జోక్యంతో దాత సహకారంతో కాంక్రీటుతో గోతులకు రిపేరు చేపట్టారు.

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-కాకినాడ

ఎస్‌సి వర్గీకరణను నిరసిస్తూ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. రత్నాకర్ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ ముసుగులో దేశవ్యాప్తంగా దళితుల ఐక్యతపై అన్ని రాజకీయ పార్టీలూ కుట్ర చేస్తున్నాయని చెప్పారు. అనంతరం చేపట్టిన ఒక్కరోజు దీక్షను ఆయన విరమించారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం సుఖపల్లి, ఎండపల్లిలో వ్యవసాయ శాఖ అధికారి ఎడిఎ పి.స్వాతితో కలిసి గ్రామాల్లో ఉన్న ధాన్యం కళ్లాలను వారు పరిశీలించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర కల్పించి ధాన్యం కొనుగోలు చేస్తారని, రైతులు ఎవరూ ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పని లేదన్నారు. మద్దతు ధర కల్పించి రైతుల వద్ద నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు ఎంఎఒ వి.జోగి రాజు, ఎఇఒ డి.నాగేంద్ర రైతులు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయం వద్ద దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రంలో ఆమె మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని దేవస్థానం తరుపున ఈ మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, పూజారి ఐవి.ప్రసాద్ శర్మ, తదితరులు సేవలందించారు.

పాస్‌పోర్టు పడిపోయినది

కాకినాడ జిల్లా, పెద్దాపురం మండలం, తిరుపతి యస్.సి. కాలనీకి చెందిన కోనాల రాజుబాబు ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. B813736, ది. 25-3-2025వ తేదీన పెద్దాపురం మెయిన్ రోడ్‌లో పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కి అందజేయగలరు.

కోనాల రాజుబాబు
తండ్రి: (లేటు) అప్పారావు
డోనెం. 5-153,
తిరుపతి యస్.సి.కాలనీ,
పెద్దాపురం మండలం, కాకినాడ జిల్లా
సెల్: 9391230975

మహారాజశ్రీ 1వ అదనపు జిల్లా జడ్జి (MACT) వారి కోర్టు, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం
M.V.O.P. No. 30/2023
Between:
Peddireddy Venkata Krishna Mohan ...Petitioner
AND
Kanchumarthi Venkata Satyanarayana and 2 Others ...Respondents
Kanchumarthi Venkata Satyanarayana, S/o. Venkata Rao, R/o. Vyshnavi Apartments, Jayakrishna puram, Rajamahendravaram. ...1st Respondent
పై నెంబరు MCOP లో 1వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా సమన్లు ఎన్నిసార్లు పంపినను ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ద్వారా సమన్లు అమలు నిమిత్తం ఆదేశించినారు. ది. 01-05-2025వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు అయి అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకోగలరు. లేని యెడల మీరు సదరు ఫిర్యాదులో విచారణ జరుపబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
తాడిచర్ల శ్రీనివాసరావు
పిటిషనరు తరపు న్యాయవాది
రాజమహేంద్రవరం
19-4-2025 సెల్: 9652011520

మహారాజశ్రీ 1వ జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
I.A. No. 750/2024 in M.V.O.P. No. 671/2022
Between:
Sorlam Kaveri and Another ...Petitioners/ Petitoners
AND
Bathina Subhash @ Subbayya and Others ...Respondents/ Respondents
R-4: Naga Veera Venkata Durga Prasad, S/o. Srinivasa Rao, Rampa Yerrampalem Village of Gokavaram Mandal. ...4th Proposed party/ 4th Respondent/ Respondent
పై నెంబరు పిటిషన్‌లో 4వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా (తప్పి) తిరుగుచున్నారు. కావున ది. 01-5-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ అభ్యంతరాలు తెలుపుకొన వలెను. లేని యెడల సదరు పిటిషన్‌ను మీరు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
బి.సీతారామయ్య
బి.లక్ష్మీనారాయణ
రాజమండ్రి అడ్వకేట్స్, రాజమండ్రి
18-4-2025

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) అనపర్తి వారి కోర్టులో
E.P. 71/2024
O.S. 99/2020
Between:
Regalla Vijaya Bhaskar Reddy, S/o. Chenna Reddy, R/o. Sathupalli Town, Sathupalli Mandal, Khammam District, Telanagana State, ...DHr
AND
Nallamilli Subba Reddy, S/o. Venkata Reddy, Yarrablu gari Sandu, Munsab gari Street, Anaparthi. ...JDr
ప్రకటన
పై తెలిపిన వారి (DH) డిక్రీ బాకీ వసూలు నిమిత్తం పై తెలిపిన కోర్టులో మీ ఆస్తి వేలం కోరుతూ పిటిషన్ దాఖలు చేసినారు. సదరు పిటిషన్‌లో మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిన తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా (తప్పి) సంచున్నందున శ్రీ కోర్టు వారు ఉత్తర్వుల ప్రకారం తెలియజేయునది ఏమనగా, ది. 09-05-2025వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టులో హాజరయి మీ అభ్యంతరం తెలుపుకోగలరు. లేనిచో పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును అని ఇందు మూలముగా తెలియజేయడమైనది.
అనపర్తి బి.వి.రమణారావు
17-04-2025 అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ రాజమండ్రి 4వ అదనపు జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టు
M.C. 18/2024
Between:
Doddi Nikhil, S/o. Ashok Babu, హిందు, వయస్సు 12 సం॥లు, మైనరు గార్డియన్ తల్లి దొడ్డి రాణి, రాజారత్నం వీధి, కొంతమూరు, రాజమండ్రి రూరల్. -పిటీషనరు
To:
Doddi Ashok Babu, S/o. వెంకటేశ్వరరావు, హిందు, 48 సం॥లు, ఎంటిఆర్ చౌదరి గారి ఎదురు ఇల్లు, రామచంద్రరావు పేట, సిర్రాపేట మండలం - 533435 -రెస్పాండెంటు
పై పిటీషనరు దొడ్డి నిఖిల్ రాజమండ్రి 4వ అదనపు జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో మనోవర్తి కోరుతూ Sec. 125 CrPC ప్రకారము పిటీషను దాఖలు చేసినారు. సదరు వ్యాజ్యము మీపై వేయగా మీకు నోటీసు కోర్టు శ్రీ కోర్టు వారు ది. 10-06-2025వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు కాగలరని ఆదేశించియున్నారు. కావున మీరు పై తేదీ, పై సమయమునకు సదరు కోర్టుకు హాజరు కాని యెడల పై వ్యాజ్యము మీ పరోక్షములో నిర్ణయించబడును. కావున తెలియజేయడమైనది.
జి.యం.వి.వి.రాజు, అడ్వకేట్
రాజమండ్రి పిటీషనరు తరపు న్యాయవాది
18-4-2025 సెల్: 9848370855

In the Court of the II Additional Senior Civil Judge at Kakinada
E.P. No. 103/2023 in O.S. No. 518/2018
Between:
Sunkara Prabhakara Rao ...DHr/ Plaintiff
AND
Thippala Srilakshmi and Others ...JDr's / Defendants
To:
JDr-2: Koyya Jyothi, W/o. (late) Srinivasa Rao @ Srinivas, Hindu, House wife, R/o. D.No. 27-2-8, Penkevari Street, Kakinada.
JDr-3: Koyya Maheswari Naga Venkata Rama Devi, D/o. (late) Srinivasa Rao @ Srinivas, Hindu, R/o. D.No. 27-2-8, Penkevari Street, Kakinada.
JDr-4: Koyya Yaswanth Sai Krishna Kumar, S/o. (late) Srinivasa Rao @ Srinivas, Hindu, R/o. D.No. 27-2-8, Penkevari Street, Kakinada.
పై నెంబరు అమలు గ్రంథములో 2 టు 4 JDr's అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ మీరు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయునది ఏమనగా మీరు ది. 02-05-2025వ తేదీ వాయిదా హియరింగ్ సమయం ఉ॥ గం॥ 10.30 ని॥లకు పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి పై పిటిషను పై మీ యొక్క అభ్యంతరాలు తెలియజేయవలెను. లేని యెడల పై అమలు గ్రంథము మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.V.S.V.LAKSHMAJI RAO
Advocates, Kakinada
Cell: 9866211196